ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
జిల్లా వార్తలు
5
సోమవారం 20 జనవరి 2025





నారాయణాపూర్ డెలివరీ సిస్టర్న్ నుంచి విడుదలవుతున్న నీరు

వీధి వ్యాపారులకు 'బల్దియా' బాసట

- వెయ్యి దుకాణాల నిర్మాణం
- నామమాత్రపు అద్దెతో కేటాయింపు
- 'సీఎం స్వనిధి' రుణాల మంజూరులో దేశంలోనే రెండోస్థానం



సప్తగిరికాలనీలో నిర్మించిన దుకాణాల సముదాయం

కరీంనగర్ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీధి, చిరువ్యాపారులకు నగరపాలక సంస్థ బాసటగా నిలుస్తోంది. రోడ్ల పక్కన, తోపుడు బండ్లపై కూరగాయలు, పండ్లు, ఇతర చిరువ్యాపారాలను చేసుకొని జీవిస్తున్న వారు గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు వీలుగా స్ట్రీట్ వెండర్లను గుర్తిస్తోంది. వారికి గుర్తింపు కార్డులను జారీ చేసి వారి సమస్యలను పరిష్కరిస్తూ వారి సంక్షేమానికి బాటలు వేస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో రోడ్ల పక్కన వీధి, చిరువ్యాపారులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వారి దుకాణాలను తొలగిస్తే చిరు వ్యాపారుల ఉపాధి దెబ్బతింటోంది. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం రూపొందించిన



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన వాణిజ్య సముదాయం

చట్టాల మేరకు స్ట్రీట్‌వెండర్స్ పథకాలను అమలు చేస్తోంది. రోడ్డు పక్కన వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులకు నామమాత్రపు అద్దెలతో శాశ్వత దుకాణాలను కేటాయించేందుకు నగరంలోని పలు చోట్ల వెయ్యి దుకాణాలను నగరపాలక సంస్థ నిర్మించింది. వాటిలో ఇప్పటికే కొన్ని దుకాణాలను నామమాత్రపు అద్దెలతో కేటాయించింది.

● పలు చోట్ల షెడ్ల నిర్మాణం

పీఎం స్వనిధి పథకం కింద గుర్తింపుకార్డులు కలిగిన చిరు, వీధివ్యాపారులకు వడ్డీ లేని రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పిస్తూ వారికి ఆర్థిక చేయూతనిస్తోంది. నగరపాలక సంస్థ పరిధిలో వీధి, చిరు వ్యాపారుల కోసం సివిల్ హాస్పిటల్ సమీపంలో 126 షెడ్లను నిర్మించి ఇటీవలనే డ్రా పద్ధతిలో వ్యాపారులకు కేటాయించారు. శాతవాహన యూనివర్సిటీ సమీపంలో 25 దుకాణాలను, పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో 215 మంది వీధి, చిరు, కూరగాయలు, పండ్లు అమ్ముకునే వారి కోసం షెడ్లను ఏర్పాటు చేసింది. త్వరలోనే వాటిని వ్యాపారులకు కేటాయించేందుకు టెండర్ ప్రకటన జారీ చేసింది. టవర్‌సర్కిల్ సమీపంలోని ప్రధాన కూరగాయల మార్కెట్, అన్నపూర్ణ కాంప్లెక్సు తదితర ప్రాంతాల్లోని వీధి, చిరు, పండ్లు, కూరగాయల వ్యాపారులకు కేటాయించేందుకు కలెక్టర్ బంగ్లా ముందు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో 250 షెడ్లు, దుకాణాలను నిర్మిస్తోంది. సప్తగిరికాలనీలో 50 మంది కూరగాయలు, చిరువ్యాపారుల కోసం షెడ్లను, చైతన్యపురిలో షెడ్లను నిర్మించింది. కశ్మీరుగడ్డ రైతు బజారు స్థానంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో వందకుపైగా దుకాణాలను నిర్మిస్తోంది. ప్రస్తుతం నిర్మించిన వాటితో కలిపి వెయ్యి వరకు దుకాణాలను నిర్మిస్తోంది.

● నగరంలో 12 వేల మంది చిరు వ్యాపారులు

నగరంలో 12వేల మందికిపైగా చిరు, వీధి, పండ్లు, కూరగాయల వ్యాపారులు స్ట్రీట్ వెండర్స్‌గా నగరపాలక సంస్థలో గుర్తింపు కార్డులను పొందారు. వీరితో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి స్ట్రీట్ వెండర్స్ కమిటీ రూపొందించి వారి సమస్యలను పరిష్కరించడంతోపాటు సంక్షేమ పథకాలు వారికి అందే విధంగా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి స్వనిధి పథకం ద్వారా నాలుగేళ్ల నుంచి విడతల వారిగా వడ్డీ లేని రుణాలను బ్యాంకుల నుంచి మంజూరీ చేయిస్తోంది. మొదటి

సీఎం స్వనిధి రుణాల వివరాలు	వ్యాపారులు	తీసుకున్న మొత్తం (రూ.లు)
మొదటి విడత	11,900	10 వేలు
రెండో విడత	9,000	20 వేలు
మూడో విడత	3,000	50 వేలు

మిగతా 8వ పేజీలో...

మెట్ట ప్రాంతానికి 'ఎల్లంపల్లి' నీరు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గంగాధర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి నీరు ఆదివారం గంగాధర గడ్డను తాకాయి. నారాయణపూర్ రిజర్వాయర్ ఎడమ కాలువను ఆధారం చేసుకుని సాగు చేసిన పొలాలు తడి ఆరుతుండగా ఎల్లంపల్లి నీటి కోసం ఎదురు చూపులని 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రితో మాట్లాడి నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. గతంలో ఫిబ్రవరి, మార్చిలో విడుదల చేయగా ఈ యాసంగిలో రైతుల కోరిక మేరకు ముందస్తుగా జనవరిలోనే ఎల్లంపల్లి నీరును నారాయణపూర్ రిజర్వాయర్‌కు విడుదల చేశారు. మేడారం రిజర్వాయర్ నుంచి ఆదివారం మధ్యాహ్నం విడుదల చేయగా 27 కిలోమీటర్ల దూరం నుంచి సాయంత్రం నారాయణపూర్ డెలివరి సిస్టర్న్ వద్దకు చేరుకున్నాయి. నీరు విడుదలతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు నియోజకవర్గ రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

● మాది రైతు ప్రభుత్వం :ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మెట్ట ప్రాంతమైన చొప్పదండి నియోజకవర్గంలో రైతులకు ఎలాంటి కష్టం రాకుండా అండగా ఉంటానన్నారు. పంటలు ఎండిపోకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా జనవరిలోనే ఎల్లంపల్లి నీరు విడుదల చేశామన్నారు. ప్రతి గుంటకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఆయకట్టుకు సాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా పంపుల వద్ద ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పూజలు నిర్వహించారు. నీటి విడుదలకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుద శాఖ మంత్రికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

మాదిగల మహా ప్రదర్శనకు మద్దతివ్వాలి

సుభాష్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మాదిగల మహా ప్రదర్శనకు మద్దతు ఇవ్వాలని బీసీ కవులు, కళాకారులు, మేధావుల ఐక్యవేదిక కన్వీనర్ దరువు అంజన్న కోరారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పోరాటం 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ సారథ్యంలో పోరాటం సాగుతుందన్నారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ పోరాటంలో ఎందరో అమరులయ్యారన్నారు. వారి త్యాగం వృథా కాదని, త్వరలో వర్గీకరణ అమలు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కవి, రచయిత మోహన్ బైరాగి మాట్లాడుతూ వర్గీకరణ అనేది ప్రజాస్వామికమైన హక్కు అని, దానిని వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో కవ్వంపల్లి రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, దోమకొండ శ్రీనివాస్, గుండా థామస్, తడగొండ రమేశ్, దోమకొండ నరేష్, దోమకొండ గోపి పాల్గొన్నారు.

నిలిచిన 'ఆరోగ్య శ్రీ' సేవలు

- పది రోజులుగా ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు
- బకాయిలు చెల్లిస్తేనే సేవల పునరుద్ధరణ

సుభాష్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయాయి. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటి వరకు తెల్లరేషన్‌కార్డు ఇవ్వగానే ఆసుపత్రుల్లో చేర్చుకొని మెరుగైన వైద్యసేవలందించిన ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహకులు ఇప్పుడు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశామని చెబుతునానరు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళు



తున్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం బిల్లులను ఇవ్వక పోవడంతో యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశాయి. కొన్నినెలలుగా ఆరోగ్యశ్రీ వైద్యసేవలకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులు బకాయిలభారం మోయలేమంటూ ఈనెల 10 నుంచి ఆరోగ్యశ్రీ సేవలను పూర్తిగా నిలిపివేశాయి.పెండింగ్ బిల్లులన్నిటిని చెల్లిస్తే తప్పా తిరిగి ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్దరించలేమంటూ తేల్చిచెప్పడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆసుపత్రులకు వెళ్లి తమకు వైద్యం అందించాలంటూ ప్రాధేయపడుతున్నారు. ముఖ్యంగా కార్డియాలజీ, న్యూరో, ఆర్థో, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి అత్యవసర సేవలు కావలసిన పేషంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● బిల్లుల పెండింగ్‌తో ఇబ్బందులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 49 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. అందులో 32 ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు ఈనెల 10నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశాయి. నెలల తరబడి ఆరోగ్యశ్రీ బిల్లులను పెండింగ్‌లో పెట్టడంతో పెద్ద మొత్తంలో డబ్బులు నిలిచిపోయి ఇబ్బందులు పడాల్సివస్తోందని ఆసుపత్రుల నిర్వాహకులు అంటున్నారు. తమకు రావలసిన పెండింగ్ బిల్లులను ఇవ్వాలని కోరుతూ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల కమిటి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. పభుత్వం నిధులు విడుదల చేయకపో వడంతో తప్పని సరి పరిస్థితుల్లో సే వలు నిలిపి వేయాల్సి వచ్చిం దని నెట్‌వర్క్ ఆసుపత్రుల నిర్వహకులు చెబుతున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ఇన్నాళ్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నప్పటికి ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించా మంటున్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేక పోవడం, నిర్వహణ భారం పెరిగి పోవడంతో తప్పని పరి స్థితుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపి వేశామని, ప్రజలు, ప్రభుత్వం తమను అర్థం చేసుకో వాలని ఆస్పత్రుల నిర్వహకులు కోరుతున్నారు.

● ప్రభుత్వ ఆసుపత్రుల్లో అరకొర సౌకర్యాలు

జిల్లా ఆసుపత్రి, చల్మెడ, ప్రతిమ వైద్య కళాశాలల్లో మాత్రమే ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు లేక, అన్నిరకాలు పరీక్షలు, మందులు అందుబాటులో లేక పోవడంతో పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్దరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం



2కే రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలో సీపీఎం రాష్ట్ర మహాసభలు విజయవంతానికి గీతాభవన్ చౌరస్తా నుంచి కమాన్ చౌరస్తా వరకు 2కే రన్ నిర్వహించారు. రన్‌ను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భారత కమ్యునిస్టు పార్టీ (మార్కిస్టు) సీపీఎం తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. ఈ నెల 25న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీపీఎం నిరంతరం పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, కూలీలు, వృత్తిదారులు, ఉద్యోగులు, కష్టజీవుల హక్కుల కోసం పోరాడుతున్న పార్టీ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రాష్ట్ర మహాసభల్లో అనేక ప్రజా సమస్యలపై చర్చించి పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యుడు ఎడ్ల రమేష్, జి రాజేశం, డి నరేష్, పటేల్, కోనేటి నాగరాణి, నాయకులు తిప్పారపు సురేష్, జి తిరుపతినాయక్, గజ్జల శ్రీకాంత్, కాంపల్లి అరవింద్ పాల్గొన్నారు.

మైసమ్మ గుట్ట నుంచి మానేరుపై వంతెన నిర్మించాలి



సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

గన్నేరువరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం మైసమ్మ గుట్ట ప్రాంతం నుంచి మానేరు నదిపై వంతెన నిర్మించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బ్రిడ్జి జేఏసి చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైసమ్మ గుట్ట నుంచి బ్రిడ్జి నిర్మిస్తే మూడు మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దవచ్చన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేసి బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తిప్పర్తి నిఖేష్, గంప వెంకన్న, బామండ్ల రవిందర్, పుల్లెల రాము, కాంతాల అంజిరెడ్డి, మర్రి వెంకటమల్లు, గువ్వ వీరయ్య, భూమల్ల అనిల్‌కుమార్, పురంశెట్టి బాలయ్య పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెన



కూలిపోయిన రక్షణ గోడలు

మానకొండూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామ శివారులోని డీబీఎం 6 ఉపకాల్వపై వంతెన ప్రమాదకరంగా మారింది. ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు కూలిపోయాయి. కరీంనగర్- జమ్మికుంట ప్రధాన రహదారిపై ఉన్న వంతెనపై నుంచి నిత్యం వందలాది వాహనాలు వెళుతుంటాయి. రక్షణ గోడలు కూలి పోయి నాలుగేళ్ల గడిచినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడ లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'మీ టికెట్'తో చూసొద్దామా..

- ఆలయాలు, పర్యాటక ప్రాంతాల సమాచారంతో ప్రత్యేక యాప్
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

కరీంనగర్ కల్చరల్, (ఆంధ్రజ్యోతి) 7

'ఉపాధి హామీ'లో పొలం బాటలు

- కాలినడక రోడ్లు అభివృద్ధి

కరీంనగర్ రూరల్, (ఆంధ్రజ్యోతి) 8

బస్టాండ్ కిటకిట



ఆర్టీసీ బస్టాండ్ ప్లాట్‌ఫామ్‌లపై ప్రయాణికుల పడిగాపులు



ప్లాట్ ఫామ్‌పైకి బస్సు రావడంతోనే బస్సులోకి వెళ్లేందుకు క్యూకట్టిన ప్రయాణికులు

సంక్రాంతి సెలవులు ముగిశాయి. గ్రామాలకు వెళ్లిన ప్రజలు నగరం బాట పట్టారు. దీంతో కరీంనగర్ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపినా ప్రజలు ఇబ్బందిపడ్డారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్



గ్రామాల నుంచి నగరానికి చేరుకుంటున్న ప్రయాణికులు, విద్యార్థులు



బస్సులో సీట్లు ఆపేందుకు బస్సు టైర్ ఎక్కిన యువతి

డ్రైనేజీలో పడి యువకుడి మృతి


నరేష్ మృతదేహం

ఇల్లందకుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి డ్రైనేజీలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం ఇందిరానగర్‌కు చెందిన సకినాల నరేష్ (30) తన అత్తగారి ఊరైనా పాతర్లపల్లి గ్రామానికి చెందిన తన బాబాయి కొడం జయపాల్‌తో కలిసి ఇల్లందకుంట నుంచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లందకుంట ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో బైక్ అదుపు తప్పి డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. తీవ్ర గాయాలతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. జయపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జమ్మికుంట ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కోరుట్ల రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. కోరుట్ల పట్టణానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. రోడ్డు ప్రమాద వివరాలను గ్రామస్థులు, పోలీసులు తెలిపారు. నిజామాబాదు జిల్లా కేంద్రంలోని పెంటర్‌నగర్ చెందిన షేక్ రషీద్ (25) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై కోరుట్ల పట్టణంలోని బీముని దుబ్బ ప్రాంతంలోని తన అక్కను కలిసి జగిత్యాలలో ఉన్న స్నేహితుడిని కలవాడిని వెలు తున్నాడు. ఈ క్రమంలో వెంకటాపూర్ శివారుకు చేరుకోగా జగిత్యాల నుంచి వస్తున్న కారు రషీద్ నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో రషీద్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన వ్యవసాయక్షేత్రం వైపు దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న ఆడెపు రాజు, గాజెంకి మహేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ, కోరుట్ల ఇన్‌చార్జి నిరంజన్ రెడ్డి పరిశీలించారు. రషీద్ సోదరుడు షేక్ మజీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రషీద్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మానేయాలన్నందుకు మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మానేయాలని కూతురు మందలించినందుకు తల్లి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన వేముల నర్సవ్వ (45) కొంత కాలంగా మద్యానికి బానిసైంది. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని కూతురు పూజితను అడగడంతో ఆరోగ్యం క్షీణిస్తుందని, మద్యం మానేయాలని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన నర్సవ్వ శనివారం రాత్రి గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన నర్సవ్వ తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కూతురు పూజిత, కొడుకు శేఖర్ చుట్టు పక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. నర్సవ్వ భర్త రాజలింగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

కరీంనగర్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి రెండు ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయంలో, మల్లన్న స్వామి ఆలయంలో హుండీలను పగలగొట్టి అందులోని డబ్బులను దొంగిలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూచిపూడిలో రాణిస్తున్న 'ఖని' కళాకారిణి


కూచిపూడి కళాకారిణి జ్యోతిర్మయి

కోల్‌సిటీటౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన దగ్గుల జ్యోతిర్మయి కూచిపూడి నృత్యంలో రాణిస్తోంది. తనలాగే ఎంతో ఆసక్తి కలిగిన ఎంతో మందిని కూచిపూడి నృత్య కళాకారుణులుగా తీర్చిదిద్దుతున్నది. ఆమె భర్త ఆనంద్ సింగరేణి ఆర్‌జీ-1 ఏరియా ఓసీపీ-5లో సింగరేణి ఉద్యోగి. జ్యోతిర్మయి మూడవ తరగతి చదువుతున్న సమయంలో తండ్రి రామస్వామి కూచిపూడి నృత్య అకాడమీ జక్క కృష్ణ వద్ద చేర్పించి శిక్షణ ఇప్పించారు. హైదరాబాద్‌లో ఏలేశ్వరపు విజయవల్లీప్రియ గురువు వద్ద కూచిపూడిలో డిప్లమా పూర్తి చేసింది. కూచిపూడి నాట్యప్రదర్శనలిస్తూ నాట్యజ్యోతిర్మయిగా పేరొందింది. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సహంతో జ్యోతిర్మయి జాతీయ స్థాయిలో కూచిపూడి నృత్య ప్రదర్శనలిచ్చిన పలు అవార్డులు


జ్యోతిర్మయికి అవార్డుతో పలువురి సత్కారం

పొందింది. ఆలయాల్లో నృత్యప్రదర్శనలతో నాట్యనీరాజనం ఇచ్చేందుకు జ్యోతిర్మయి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది.

● వైష్ణవి నాట్యస్థల్‌తో పలువురికి శిక్షణ..

కూచిపూడి నృత్యాన్ని ఇతరులకు నేర్పించాలనే సంకల్పంతో వైష్ణవి నాట్యస్థల్ కూచిపూడి నృత్య అకాడమీని జ్యోతిర్మయి 15 ఏళ్ళ క్రితం ప్రారంభించింది. తన శిష్యులతో పలు ప్రదర్శనలు ఇచ్చి గిన్నిస్ వరల్డ్ రికార్డు అందుకున్నానని, ఇది తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని జ్యోతిర్మయి తెలిపింది.




కూచిపూడిలో శిక్షణ ఇస్తున్న జ్యోతిర్మయి

కారు అద్దాలు ధ్వంసం


పగిలిన కారు అద్దాలు

మల్యాల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మల్యాల మాజీ ఎంపీపీ ఆగంతపు రవళీవంశీధర్‌కు చెందిన కారు అద్దాలను ఓ యువకుడు ధ్వంసం చేశాడు. శనివారం రాత్రి సదరు యువకుడు వంశీధర్‌తో పాటు అతని కుటుంబసభ్యులను దుర్భాషలాడుతూ ఇంటి వద్దకు వచ్చాడు. ఆ సమయంలో అక్కడ గల కారు అద్దాలను ధ్వంసం చేశాడు. కాగా తమపై దాడికి యత్నించినట్లు అదే ప్రాంతానికి చెందిన యువకుడిపై వంశీధర్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఎస్సై నరేశ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

వీణవంక జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసులు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింక్‌లను ఓపెన్ చేయకూడదని చెప్పారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీసుల కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్ర మంలో బ్లూకోల్ట్స్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి


సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కొండా దేవయ్య

వేములవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మున్నూరు కాపులు ఐక్యతతో రాజకీయంగా ఎదగాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల మున్నూరు కాపు సంఘం కార్యాలయాన్ని ఆదివారం వేములవాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ పరిధిలోని జిల్లాలకు చెందిన కార్యకలాపాల నిర్వహణకు ఉపయుక్తంగా ఉంటుందన్న ఉద్దేశంతో వేములవాడలో సంఘం కార్యాలయం ప్రారంభించామని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి 3000 కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలుపుకోవాలని కోరారు. రాష్ట్ర మున్నూరు కాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రజిత, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు రత్నాకర్, రాష్ట్ర యువత కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల పూజలు

ఓదెల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు పూజలను ఘనంగా నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన నుంచి తరలివచ్చిన భక్తులంతా ఆలయంలో అర్చనలు, కోడె మొక్కులను సమర్పించారు. అలాగే మల్లన్నకు భక్తులు ఒగ్గుపూజారులతో పట్నాలు నిర్వహించారు.


ఓదెల మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

భూవివాదంతో దాడి..
ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో ఆదివారం ఇరు వర్గాల నడుమ నెలకొన్న భూవివాదం దాడి చేసుకునే వరకు చేరుకుంది. దాడి ఘటనలో మండల కేంద్రానికి చెందిన గడ్డం పుష్పలత, ఇద్దరు కొడుకులు కరుణాకర్, జగన్ తీవ్ర గాయాలపాలయ్యారు. దాడికి పాల్పడిన బండలింగంపల్లిలోని తండ్రీకొడుకులు బందుక శ్రీనివాస్, నరేశ్‌లపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రంలోని గడ్డం ఆనందం 2020లో బండలింగంపల్లికి చెందిన నర్సయ్య వద్ద 1.08 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. పొలం వద్దకు వెళ్లిన ఆనందం భార్య పుష్పలత, ఇద్దరు కొడుకులు కరుణాకర్, జగన్‌పై అదే గ్రామంలోని బందుక శ్రీనివాస్, అతని కొడుకు నరేశ్ ఆ భూమి తమదేనని అడ్డుకున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే గడ్డపారతో దాడికి దిగారు. పుష్పలత, కరుణాకర్, జగన్ తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఆనందం ఫిర్యాదుతో శ్రీనివాస్, నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బోర్‌వెల్ వాహనం బోల్తా

మల్యాల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని బల్వంతాపూర్ స్టేజీ సమీపంలో బోర్‌వెల్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. జగిత్యాల వైపు నుంచి వస్తున్న బోర్‌వెల్ వాహనం బల్వంతాపూర్ స్టేజీ సమీపంలో జాయింట్ రాడ్డు విరగడంతో అదుపుతప్పి రహదారిపై బోల్తా పడింది. ఈ సంఘటనలో వాహనంలో గల ఒడిశాకు చెందిన సురేందర్, బీం, బాలారామ్, నిదేశ్‌లకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని పోలీసులు చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలి

హుజూరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పని చేసి పదవి విరమణ పొందిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి రాజయ్య కోరారు. పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఆదివారం హుజూరాబాద్ రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుల సమావేశం ఎం రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 పేస్కేల్ బకాయిలు, వృద్ధాప్యంలో ఉన్న కార్మికులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఫ్రీగా అనుమతించాలన్నారు. రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే అందజేయాలని డిమాండ్ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు ఆర్ చారి, రాజయ్య, వి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి) వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజరాజేశ్వరస్వామివార్లను దర్శించుకు న్నారు. రాజన్నకు ప్రీతి ప్రాతమైన కోడె మొక్కు చెల్లించుకున్నా రు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు తిరుపతిరావు, రాజేందర్, నర్సయ్య, నరేందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాజన్న ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు


సంగీత కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

● కొనసాగుతున్న ఆరాధనోత్సవాలు

వేములవాడ కల్చరల్ జనవరి 19 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటలకు లక్ష్మీనారాయణ భాగవతార్, ఉదయం 10గంటలకు వేదవతి భాగవతారి ఆధ్వర్యంలో హరికథ నిర్వహించారు. అపర్ణ భార్గవ కర్ణాటక గాత్రకచేరి, తిరుమల లత సంగీత కచేరి భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు దుర్గా మైత్రి నిర్వహించిన సోలో వీణ కచేరి, నాలుగున్నర గంటలకు హరికృష్ణ భార్గవి నిర్వహించిన సంగీత కచేరి అలరించాయి.

ఆశలు అడియాశలు

● నెరవేరని పరిశ్రమల ఏర్పాటు హామీ

● అందుబాటులో 600 ఎకరాల ప్రభుత్వ భూమి


గంభీర్‌పూర్‌లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి

కథలాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హార్టికల్చర్ యూనివర్సిటీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ, గొర్రెల పెంపకం, సైనిక్ స్కూల్, లెదర్ పార్క్ వంటి పరిశ్రమలు గంభీర్‌పూర్‌కు వస్తాయని గంపెడాశలు పడ్డా కల నెరవేరలేదు. గత బీఆర్ఎస్ హయాంలో పరిశ్రమలు వస్తాయంటూ నేతలు ఇచ్చిన హామీ లతో స్థానికులు ఎంతో సంబరపడ్డా నిరాశే ఎదురైంది. గ్రామ శివారులో గుట్టల ప్రాంతంలో సుమారు 600 ఎకరాలు మేర ప్రభుత్వ భూములు ఉండడంతో ఇక్కడ పరిశ్రమలకు అనువైన ప్రాంతమని నిర్ణయించారు.

● గంభీర్‌పూర్ శివారులో..

గంభీర్‌పూర్ శివారులో 570, 571 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని రెవెన్యూ అధికారులు ఇచ్చిన నివేదికలతో పరిశ్రమల స్థాపనకు అనువుగా ఉంటుందనే భావనకు వచ్చారు. 2014లో తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్ఎస్ సర్కారు కొలువు దీరగా హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సంబంధిత శాఖ అధికారులు హడావుడి చేశారు. అయితే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజవర్గం గజ్వేల్‌కు మంజూరు చేయడంతో నిరాశకు గురయ్యారు. తదనంతరం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటును పరిశీలించి రెవెన్యూ అధికారులతో సర్వేలు పూర్తి చేయించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఫలితం కనిపించలేదు. గొర్రెల పెంపకం, లెదర్ పార్క్, సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి పలు మార్లు ప్రతిపాదనలు చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదు. పరిశ్రమలు ఏర్పడితే వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశించినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.

● నాలుగు మండలాలతో..

బీమారం, కొడిమ్యాల, రుద్రంగి, చందుర్తి మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లాకు అనుసంధానంగా ఉండడంతో పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల మెరుగుకు ఎంతో అనుకూలంగా ఉంది. గత సర్కారు విస్మరించిన నేపథ్యంలో కొత్త సర్కారు గంభీర్‌పూర్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తుందని కోటి ఆశలు పెట్టుకున్నారు

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర


తాండ్ర్యాలలో పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలం లోని తాండ్ర్యాలలో ఆదివారం మల్లికార్జునస్వామి జాతరో త్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి కొండపైకి స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పం డితులు మేడలాంబ కేతలాంబ సహిత మల్లికార్జునస్వా మి కల్యాణం నిర్వహించగా చుట్టు పక్కన గ్రామాలైన గంభీర్‌పూర్, పోసానిపేట, ఇప్పపల్లి, పోతారం గ్రామాల నుంచి వచ్చిన భక్తులు వీక్షించారు. ఈ సందర్భంగా భక్తులు త మ మొక్కులు చెల్లించుకున్నారు. వేము లవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్‌కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జిల్లా పరిషత్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ పూజల్లో పాల్గొ న్నారు. ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

బీసీ జాతీయ సంక్షేమ సంఘం యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పర్శరాం

వేములవాడ కల్చరల్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ జాతీయ సంక్షేమ సంఘం యువజన విభాగం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెడ్డవేణి పర్శరాంను నియమిస్తూ ఆర్.కృష్ణయ్య ఆదివారం నియామకపు పత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లో ఆదివారం నియామక పత్రాన్ని అందిం చినటట్లు బీసీ జాతీయ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాం తెలిపారు. తన నియమకానికి సహకరించిన ప్రతీ ఒక్క బీసీ జాతీయ సంక్షేమ రాష్ట్ర జిల్లా మండల నాయకులకు రెడ్డవేణి పర్శరాం కృతజ్ఞతలు తెలిపారు.

ద్విచక్ర వాహనం అప్పగింత

భగత్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో కొద్ది రోజులుగా ఉంటున్న టీఎస్02ఈక్యూ7104 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని యజమాని అందె కృష్ణకు ఆర్టీసీ అధికారులు ఆదివారం అందించారు. కొద్ది రోజులుగా బస్టాండ్ ఆవరణలో ద్విచక్ర వాహనాన్ని ఉండడాన్ని గమనించి భద్రత సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ భద్రత ఏటీఎం బి సురేష్ ద్విచక్ర వాహనాన్ని యజమానికి అందించారు. తన బైక్ ఇంటి ఎదుట పార్క్ ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తు కెళ్లారని, నెల రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు పేర్కొన్నాడు. కార్యక్రమంలో బస్టాండ్‌భద్ర త సిబ్బంది లక్ష్మతి, ఏఎస్ఐ అజయ్‌కుమార్, అంజయ్య, పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బాల బాలికల కబడ్డీ పోటీలు


విజయం సాధించిన కరీంనగర్ బాలికల జట్టు

హుజూరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో సౌత్‌జోన్ బాల బాలికల అండర్-16 కబడ్డీ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. బాలికల విభాగంలో హుజూరాబాద్ జట్టుపై కరీంనగర్ జట్టు విజయం సాధించింది. బాలుర విభాగంలో కరీంనగర్ జట్టుపై హుజూరాబాద్ జట్టు ఫైనల్లో విజయం సాధించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక బహుమతులు ప్రదానం చేశారు. అలాగే క్రీడాకారులకు వర్ధినేని రవీందర్ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సునీల్‌రెడ్డి, రమేష్, రవీందర్, తిరుమల్‌రెడ్డి, ముత్యంరాజు, టి శ్రీనివాస్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

అనుమతి లేని లేఅవుట్‌లో హద్దు రాళ్ల తొలగింపు

కరీంనగర్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని అక్రమ లేఅవుట్లపై ఆదివారం పంచాయతీ అధికారులు కొరడా ఝుళిపించారు. నగునూర్‌లోని సర్వే నంబర్ 453, 454లోని రెండెకరాల విస్తీర్ణంలో పంచాయతీ, సుడా అనుమతి లేకుండానే లే అవుట్ చేసి ప్లాట్లను విక్రయిస్తున్నారని స్థానికుల ఫిర్యాదు చేయడంతో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది హద్దు రాళ్లను తొలగించారు.

షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తాం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ పునఃప్రారంభిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరాభవన్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన కోటి యాభై లక్షల విలువల గల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి కింద లబ్ధిదారులకు ఆసుపత్రుల్లో అయిన ఖర్చులో 25-30 శాతం అందిస్తోందన్నారు. ప్రజలు ముఖ్యంగా ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్న ఆసుపత్రుల్లో వైద్యసేవలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆరోగ్యశ్రీ కింద రాష్ట్ర ప్రభుత్వం 10లక్షల రూపాయల వరకు వైద్య ఖర్చులు అందజేస్తోందన్నారు. గత ప్రభుత్వం కన్నా మిన్నగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రుణమాఫీ అంశాన్ని బీఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టలేదని, బీజేపీకి రుణమాఫీపై సోయిలేదన్నారు. దేశంలో రైతులకు రుణమాఫీ చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, యూపీఏ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వమే అన్ని రాష్ట్రాల రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. ఉచిత విద్యుత్‌పై పేటెంట్ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, గత ప్రస్తుత ప్రభుత్వాలు ఆ విధానాన్ని కొనసాగింపు చేస్తున్నాయన్నారు. జనవరి 26 నుంచి రేషన్‌కార్డుల జారీ, రైతుభరోసా, వ్యవసా య కూలీలకు రైతు భరోసాతో పాటు ఇందిరమ్మ ఇళ్లను ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్లు కట్టించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, అనర్హులకు ఒత్తిళ్లకు తలొగ్గి ఇళ్ల మంజూరుకు అవకాశం ఇస్తే చట్టప్రకారం చర్యలుంటాయ న్నారు. పసుపు బోర్డు ప్రకటన శుభపరిణామమని, పసుపు బోర్డు ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల పరిహారం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో నాయకులు బండ శంకర్, తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి, పిప్పిరి అనిత, జున్ను రాజేందర్, రాధాకిషన్‌రావు, దుర్గయ్య, బారి, కమాల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మీ టికెట్'తో చూసొద్దామా..



- ఆలయాలు, పర్యాటక ప్రాంతాల సమాచారంతో ప్రత్యేక యాప్
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆలయ దర్శనాలు, విహార యాత్రల విశేషాలు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మీ టికెట్ పేరుతో ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌లో రాష్ట్రంలోని 15 ఆలయాలు, 129 పార్కులు, 54 బోటింగ్, జంతు ప్రదర్శన శాలలు, మెట్రో, ఆర్టీసీ, మ్యూజియాలు, ప్లే అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్స్‌కు సంబంధించిన వివరాలు పొందుపరిచారు. స్మార్ట్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత ప్రవేశ టికెట్లు పొందవచ్చు. ఇటీవల ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ యాప్‌ను లాంఛనంగా ఆవిష్కరించారు. మరిన్ని ప్రధాన ఆలయాలు, పర్యాటక ప్రాంతాల వివరాలు ఈ యాప్‌లో పొందుపరచాల్సి ఉంది.

● ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు, ప్రాంతాల వివరాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, జగిత్యాల జిల్లా కొండగట్టు అంజనేయస్వామి దేవాలయం, రాజన్న సిరిసిల్ల జిల్లా అర్బన్ ఫారెస్ట్, కరీంనగర్‌లోని ఎల్ఎండీ, పెద్దపల్లిలో బోటింగ్‌కు సంబంధించిన వివరాలు యాప్‌లో ఉంటాయి.

● డౌన్‌లోడ్ ఇలా చేసుకోవాలి

తెలంగాణ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్ డెలివరి వారు రూపొందించిన 'మీ టికెట్' యాప్‌ను ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. అకౌంట్‌లో పిన్ నంబరు జనరేట్ చేసుకోవాలి. మన ఫోన్‌కు ఓటీపీ నంబరు వచ్చాక దాన్ని నమోదు చేయాలి. అనంతరం ఫోన్ నంబరు, పిన్ నంబరు ఎంటర్ చేసి లాగిన్ అయితే అందులో అన్ని వివరాలు తెలుస్తాయి.





వేములవాడ

గర్భాలయ దర్శనం	రూ. 1000
శీఘ్ర దర్శనం	రూ. 100
కోడె కట్టడానికి	రూ. 200

సేవలకు వేర్వేరుగా రుసుములు చెల్లించాల్సి ఉటుంది.



కొండగట్టు

గర్భాలయ దర్శనం	రూ. 400
అతి శీఘ్ర దర్శనం	రూ. 300
శీఘ్ర దర్శనం	రూ. 100



ఎల్ఎండీ, పెద్దపల్లిలో బోటింగ్

పిల్లలకు	రూ. 30
పెద్దలకు	రూ. 50
స్పీడ్ బోట్‌కు నలుగురికి	రూ. 350



సిరిసిల్లలోని అర్బన్ ఫారెస్ట్ పార్క్

కెమెరా	రూ. 300,
టూ వీలర్స్ పార్కింగ్	రూ. 10
బస్సు, వ్యానుకు	రూ. 50
ప్రవేశ రుసుము:	
పిల్లలకు	రూ. 10
పెద్దలకు	రూ. 30

● యాప్‌లో ఇంకా చేర్చాల్సినవి..

ధర్మపురి ఆలయ వివరాలు.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఉజ్వల, జింకల పార్క్ విశేషాలు, జిల్లా కేంద్రంలోని ప్రాచీన శైవ, వైష్ణవ క్షేత్రాల వివరాలు పొందపర్చలేదు. ఎలగందుల, మొలంగూరు, బొమ్మలమ్మగుట్ట, నగునూరు, ధూలికట్ట వంటి చారిత్రక ప్రదేశాల వివరాలను కూడా పొందుపరిస్తే ఉమ్మడి జిల్లా వాసులు ఆయా ప్రాంతాలను యాప్ సాయంతో సందర్శించే అవకాశం ఉంటుంది.

వినోద భోజనంబులో 'ఖని' కళాకారుడి ప్రతిభ

కోల్‌సిటీటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో దర్శకుడు జంధ్యాల జయంతి సందర్భంగా నిర్వహించిన వినోద భోజనంబు కార్యక్రమంలో గోదావరిఖనికి చెందిన స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ ప్రధానకార్యదర్శి చంద్రపాల్ ప్రతిభ కనపర్చారు. స్టాండప్ కామెడీతో నవ్వులు పూయించి ప్రశంసలందుకున్నారు. అందుకు గాను హాజరైన అతిథులు సినీదర్శకులు రేలంగి నరసింహారావు, దూరదర్శన్ ప్రయోక్త ఓలేటి పార్వతీశం చేతుల మీదుగా చంద్రపాల్‌కు జ్ఞాపికను అందజేసి అభినందించారు.



జ్ఞాపిక అందుకుంటున్న చంద్రపాల్

ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రంగంపల్లిలోగల పెద్దపల్లి లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్యార్మీ షరీఫ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ బారీ, ప్రధానకార్యదర్శి సోమిశెట్టి తిరుపతి, వైస్‌ప్రెసిడెంట్ అజయ్, జాయింట్ సెక్రెటరీ ఎండి జహంగీర్, కోశాధికారి ఎండి అఫ్జల్, తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకలు నిర్వహిస్తున్న లారీ డ్రైవర్లు

కన్నుల పండువగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని దసరా గుట్టపైన గల ప్రహ్లద శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో స్వామి కల్యాణం కన్నుపండువగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కల్యాణాన్ని గ్రామ, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో స్థాపిత దేవతల పూజ, ఉత్సవ మూర్తులను పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు, పూజలు కార్యక్రమా ను బ్రహ్మశ్రీ గంగాప్రసాద్ దీక్షిత్ యాజ్ఞికంలో నంబి గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. స్వామి వారికి గ్రామ, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు పట్టు వస్త్రా లు సమర్పించగా అలంకరించారు. అనంతరం పురోహితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణం వైభవంగా జరిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పురోహితులు రాజగౌతం, శితి కంఠ, షణ్ముఖశర్మ, నంబి మనోహర్‌శర్మ, నంబి రాజేందర్‌శర్మ, గ్రామ, ఆలయా భివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అనుమతులు లేని సంఘాలతో క్రీడాకారులకు అన్యాయం

» హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు, నిబంధనల ప్రకారం లేని హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌తో క్రీడాకారులకు తీవ్రఅన్యాయం జరిగే అవకాశం ఉందని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు 52 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. అసోసియేషన్ పరిధిలో పనిచేస్తున్న తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను, జిల్లాలోని అసోసియేషన్లు జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామన్నారు. 2021లో ఓ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని రాష్ట్రం, జిల్లాలో ఒలింపిక్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ పరిశీలకులు లేకుండానే సంఘాలను ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా సంఘాన్ని నడుపుతున్నట్లు ఆరోపించారు. ఈ సంఘం ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర పోటీలు లేకుండానే జాతీయ పోటీలు నిర్వహిస్తున్నారని, ఇలాంటి పోటీలతో క్రీడాకారులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సంఘం రాష్ట్రస్థాయిలో కీలకమైన పోస్టులో ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్న వ్యక్తి కోచ్‌గా వ్యవహరిస్తూ రాష్ట్ర, జాతీయ పోటీలకు రెఫరీగా వ్యవహరిస్తున్నాడని, ఈ విషయంపై స్పోర్ట్స్ అథారిటీ దృష్టి సారించాలని కోరారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్ మాట్లాడుతూ కరీంనగర్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తమ రాష్ట్ర అసోసియేషన్ అనుమతి ఉన్నట్లు చూపించి జిల్లాలో ఓ సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేసి క్రీడాకారులను తప్పుదోవ పటిస్తున్నాడన్నారు. ఈ రిజిస్ట్రేషన్‌పై రిజిస్ట్రార్, సీపీకి ఫిర్యాదు చేసి కోర్టులో న్యాయపోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి కె రమేష్, నల్గొండ కార్యదర్శి పుల్లయ్య, మహబూబ్‌నగర్ కార్యదర్శి శంకర్ నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ సంఘ సభ్యులు రమేష్, పుల్లయ్య, శంకర్ నారాయణ, లక్ష్మణ్

పట్టు పరిశ్రమ అసిస్టెంట్ డైరెక్టర్‌గా రషీద్



మహ్మద్ రషీద్

కరీంనగర్ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టు పరిశ్రమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గా మహ్మద్ రషీద్‌కు పదోన్నతి కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ యాస్మిన్‌భాషా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా సెరికల్చర్ అధికారిగా పనిచేస్తున్న ఆయనకు పదోన్న తి కల్పించారు. 1985లో దినసరి కూలీగా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో నాలుగేళ్ళు పనిచేసిన ఆయన స్కేల్ పోస్టు ఆపరేటర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఇక ఆ తర్వాత సెరికల్చర్ ఆఫీసర్‌గా పదోన్నతి పొంది హన్మకొండ జిల్లాలో పనిచేసిన రషీద్ హుజురాబాద్ డివిజన్ సెరికల్చర్ అధికారిగా, కరీంనగర్ జిల్లా అధికారిగా కొనసాగుతున్నారు. పదోన్నతి కల్పించడంపై రషీద్ సంతోషం వ్యక్తం చేశారు.

ఐక్య పోరాటాల ద్వారానే కనీస వేతనం



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక ఐక్య పోరాటాల ద్వారానే కనీస వేతనం, మద్ధతు ధరలు సాధించుకోవచ్చని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక, కర్షక మైత్రి దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982 జనవరి 19న సాధారణ సమ్మె సాధించిన గొప్ప విజయం కార్మికుల, కర్షకుల ఐక్యత అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ సాధారణ సమ్మెకు ముందే తమిళనాడులో రాష్ట్ర ప్రభుత్వం వేలాది మందిని అరెస్టు చేసి జైలులో వేసిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వడ్ల రాజు మాట్లాడుతూ వ్యవసాయకార్మికులు, పేద రైతులే కాక గ్రామాల్లో ఉన్న వృత్తి దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో రాయికంటి శ్రీనివాస్, కాంపల్లి పోచయ్య, రాజమణి, కవ్వంపల్లి రవి పాల్గొన్నారు.

రైతు సేవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మొగిలి కిరణ్‌యాదవ్



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

ముత్తారం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మొగిలి కిరణ్ యాదవ్‌ను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ నియామక పత్రాలను హైదరాబాదులోని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మొగిలి కిరణ్ యాదవ్ మాట్లాడుతూ పూర్వ వ్యవసాయసాగులో ఎలాంటి పద్ధతులు పాటించారో రైతులకు తెలియజేసే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రైతులకు నకిలీ విత్తనాల విక్రయాలు, అత్యధిక ధరలకు ఎరువు విక్రయాలను ఉపేక్షించబోమని తెలిపారు. కాగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా చిగురు విద్యాసాగర్‌ను నియమితులైనట్లు కిరణ్ యాదవ్ తెలిపారు.

క్రీడలతో ఆరోగ్యం

● ఆర్ఐలు కుమారస్వామి, మోడం సురేష్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆనందం, ఆరోగ్యం పెంపొందుతాయని ఆర్ఐ ఆఫ్ పోలీస్ కె కుమారస్వామి, మోడం సురేష్ అన్నారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో రెండో రోజు తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలో వ్యాయామం, క్రీడలు తప్పనిసరి అని సూచించారు. రాష్ట్రస్థాయి క్రీడలను ఘనంగా నిర్వహిస్తున్న జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను అభినందించారు. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలని, ఓడినవారు వచ్చే సంవత్సరం గెలుపునకు ప్రయత్నించాలన్నారు. క్రీడాకారులు అందరు కూడా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. మరో అతిథి జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి బి వేణుగోపాల్ మాట్లాడుతూ క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఈ క్రీడలు మంచి వేదికగా నిలుస్తాయన్నారు. క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్లు మంచి ప్రతిభచాటి చాంపియన్‌షిప్ సాధించాలన్నారు. కార్యక్రమలో తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, పోటీల పరిశీలకులు దీపక్ ప్రసాద్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేని లక్ష్మణ్, ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్, నెమలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, కోశాధికారి కనకయ్య, సంఘ రాష్ట్ర బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారులు మల్లేష్, శ్రీనివాస్, రాజశేఖర్, జయంత్, అమర్, శివాజీ, సాయి,తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్ఐలు కె కుమారస్వామి, మోడెం సురేష్

● ఫైనల్స్‌కు కరీంనగర్, వరంగల్ జట్లు..

తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీల ఫైనల్స్‌కు కరీంనగర్, వరంగల్ జట్లు చేరాయి. ఆదివారం సాయంత్రం జరిగిన సెమీఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు 23-21 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొంది ఫైనల్స్‌కు ప్రవేశించింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో వరంగల్ జట్టు 28-15 పాయింట్ల తేడాతో ఆదిలాబాద్ జట్టుపై గెలుపొంది ఫైనల్స్‌కు చేరింది. సోమవారం ఉదయం ఫైనల్స్ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. కాగా మూడు, నాలుగు స్థానాల కోసం మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వీధి వ్యాపారులకు 'బల్దియా' బాసట

(5వ పేజీ తరువాయి)

విడతలో 11,900 మంది చిరు వ్యాపారులకు 10వేల రూపాయలను వివిధ బ్యాంకుల నుంచి ఇప్పించింది. దీనితో మూడు లక్షల జనాభా కలిగిన నగరాల్లో అత్యధికంగా స్వనిధి రుణాలను మంజూరు చేయడంలో కరీంనగర్ అగ్రస్థానంలో నిలిచింది. మొదటి విడత రుణాలను తీసుకొని తిరిగి రుణాలను సక్రమంగా చెల్లించిన వ్యాపారులకు రెండో విడతలో తొమ్మిది వేల మంది వరకు 20వేల రుణాలను ఇప్పించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు మూడు వేల మంది కి పిఎం స్వనిధి కింద రూ. 50 వేల వరకు రుణాలను ఇప్పించి దేశంలోనే రెండోస్థానంలో కరీంనగర్ నిలిచింది. ఇలా చిరు, వీధి వ్యాపారుల కోసం నగరపాలక సంస్థ అనేక కార్యక్రమాలను రూపొందిస్తూ వారికి బాసటగా నిలుస్తోంది.

● వ్యాపారుల జీవన ప్రమాణాలుపెంచడమే లక్ష్యం

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

నగరంలోని చిరు వ్యాపారులు గౌరవంగా జీవిస్తూ జీవన ప్రమాణాలు పెంచాలనే లక్ష్యంతో నగరపాలక సంస్థ పాలకవర్గం ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి అందించేందుకు కృషి చేస్తోంది. అద్దెల భారాన్ని తట్టుకోలేని చిరువ్యాపారులు నామమాత్రపు అద్దెలతో దుకాణాలను నడిపించుకొని జీవించేందుకు పలు చోట్ల శాశ్వత దుకాణాలను నిర్మించి, వాటిని పారదర్శకంగా టెండర్లలో కేటాయిస్తున్నాము. మరోవైపు వారికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు బ్యాంకర్లతో వారికి మొదటి విడతలో 10 వేల రూపాయలు, రెండో విడతలో 20వేల రూపాయలు, మూడో విడతలో 50 వేలరూపాయల రుణాలను ఇప్పించాం. రుణాల ఇప్పించడంలో దేశంలోనే కరీంనగర్ రెండోస్థానంలో నిలువడం గర్వంగా ఉంది. రుణాలను సద్వినియోగం చేసుకొని వాటిని ఎప్పటికప్పుడు చెల్లించి తిరిగి 50 వేల రూపాయల రుణాలను తీసుకొని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని వ్యాపారులకు సూచిస్తున్నాం.

'ఉపాధి హామీ'లో పొలం బాటలు

- కాలినడక రోడ్లు అభివృద్ధి
- మండలంలో ఐదు గ్రామాలు ఎంపిక



పొలాల్లో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలు (ఫైల్)

కరీంనగర్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో రైతుపొలాల బాటలకు మహర్దశ రానుంది. రైతులకు సంబంధించిన పనులు చేపట్టేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రత్యేకంగా ఉపాధిపనుల జాతర పేరిట రైతులకు ఉపయోగపడే పనులు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రణాళిక రూపొందించింది. ఉపాధిహామీలో రైతులకు జలసంరక్షణ పనులతో పాటు పొలాలకు వెళ్లేందుకు ఉన్న కాలినడక బాటలు అభివృద్ధి చేయనున్నారు. గతంలో మండలంలో పలుగ్రామాల రైతులు పొలాలకు వెళ్లేందుకు సరైన దారులు లేవు. దీంతో పొలాల్లోకి వెళ్లేటప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనులు జరిగే సమయంలో ఇబ్బందులు పడుతుండగా, ఎరువులు, విత్తన సంచులు తరలించడంతో పాటు వరికోత సమయంలో ధాన్యం తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కరీంనగర్ మండలంలో ఐదు కిలోమీటర్ల రోడ్డు నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఒక్కో మండల పరిధిలో ఐదు గ్రామాల్లో ఐదు కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మించనున్నారు. మండలంలోని మొగ్దుంపూర్, నగునూర్, చేగుర్తి, జూబ్లీనగర్, ఎలబోతారం గ్రామాలను ఎంపిక చేశారు. ప్రస్తుతం జూబ్లీనగర్, ఎలబోతారం గ్రామాల్లో రెండు కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణానికి అనుమతి మంజూరు కాగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతు భరోసా సర్వే నిర్వహిస్తున్నందున మరో నాలుగైదు రోజుల్లో పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

● కాలినడక దారుల అభివృద్ధి

- ఏపీవో శోభారాణి

కరీంనగర్ మండలంలో రైతులకు పొలాలకు వెళ్లే దారులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. ఉపాధిహామీ పనుల జాతరలో ప్రభుత్వం రైతుల పనులకు ప్రాధాన్యమివ్వగా ప్రస్తుతం పొలంబాటలను మట్టి రోడ్లుగా నిర్మించనున్నాం. ఇందుకుగాను ఐదు గ్రామాలను ఎంపిక చేశాము. మండలంలో ఐదు కిలోమీటర్ల రహదారి నిర్మాణం త్వరలో ప్రారంభిస్తాం.

పకడ్బందీగా ఆలయాల హుండీ లెక్కింపు

ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ



ఫటాఫట్

ప్రశ్న: ఉమ్మడి జిల్లాలోని ఏ జిల్లాలకు మీరు ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు?

సమాధానం: కరీంనగర్‌లోని 24 ఆలయాలకు, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 9 ఆలయాలకు ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నాను.

ప్రశ్న: ఎప్పుడెప్పుడు హుండీలను లెక్కిస్తారు?

సమాధానం: వేములవాడ హుండీలను నెలకు రెండుసార్లు, మిగిలిన ఆలయాల్లో ఈవోల అభ్యర్థన, సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు సంవత్సరానికి రెండు లేదా మూడుసార్లు, కొన్ని ఆలయాల్లో ప్రత్యేక ఉత్సవాల అనంతరం కూడా లెక్కిస్తాం.

ప్రశ్న: లెక్కించిన హుండీ డబ్బులను ఏం చేస్తారు?లెక్కింపునకు ఎవరు హాజరవుతారు?

సమాధానం: హుండీ డబ్బులను ఆయా దేవాలయం పేరుతో ఉన్న అకౌంట్‌లో జమ చేస్తాం. లెక్కింపునకు పలు స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటాం.

ప్రశ్న: హుండీల భద్రత విషయంలో మీరేం చెబుతారు?

సమాధానం: నైట్ వాచ్‌మెన్‌లుంటారు. సీసీ కెమెరాలు ఉంటాయి. ప్రతీ రోజూ ఆలయాలను రాత్రి పూట గస్తీ తిరిగే పోలీసులు పర్యవేక్షిస్తుంటారు.

- కరీంనగర్ కల్చరల్

కశ్మీరుగడ్డ వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం



మంత్రి పొన్నంను సన్మానిస్తున్న మేయర్ సునీల్‌రావు, వాకర్స్ ప్రతినిధులు

కరీంనగర్ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కశ్మీరుగడ్డ వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని హుస్నాబాద్ మండలంలోని సముద్రగండిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఉదయం వాకింగ్ చేస్తే ప్రతీఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేద్దాం



సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డిని పరీక్షిస్తున్న డాక్టర్

సుభాష్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం కోసం కలికట్టుగా కృషి చేద్దామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని సప్తగిరి కాలనీలోని రహమానియాలో ఫార్చ్యూన్ మెడికేర్ ఆసుపత్రి సౌజన్యంతో ఆల్ బీసీ మైనార్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పేదల ఆరోగ్యానికి ప్రత్యక్ష, పరోక్ష సహకా రంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీ యమ న్నారు. వైద్య శిబిరంలో గుండటి శ్రీనివాస్‌రెడ్డి, తాజుద్దీన్, శ్రీకాంత్, సుకురుద్దీన్, శంకర్, మజీద్, మాజిద్, జ్యోతిరెడ్డి, ఖాజామియా, నసీరుద్దీన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహాభారత ప్రవచన జ్ఞాన యజ్ఞం ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పండితుడు మల్లాది చంద్రశేఖర శాస్త్రి శతజయంతి ఉత్సవం సందర్భంగా నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం మహాభారత ప్రవచన జ్ఞానయజ్ఞం ప్రారంభమైంది. ఉదయం గోపూజ, గురువందనం, స్థాపిత దేవతా పూజ, లక్ష్మీగణపతి హోమం, విష్ణు సహస్ర నామ పారాయణం జరిగాయి. సాయంత్రం సిద్ధి బుద్ధి వినాయక కల్యాణం జరిగింది. ఉదయం, సాయంత్రం ప్రవచన కర్త చంద్రశేఖర శాస్త్రి శిష్యుడు, శృంగేరి శారదాపీఠ పౌరాణికుడు డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ మహాభారతంపై ప్రవచనం చేశారు. రాగంపేట ఆర్యవైశ్య స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ నలుమాచు మనోహర్, సుదర్శనం, వేంకటేశం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పురస్కారాలు బాధ్యతను పెంచుతాయి



సంక్రాంతి ప్రతిభా పురస్కారాలతో వివిధ రంగాల వ్యక్తులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పురస్కారాలు బాధ్యతను పెంచుతాయని శతాధిక గ్రంథ ప్రచురణ కర్త, భవానీ సాహిత్య వేదిక సంస్థ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఫిలింభవన్‌లో ఆర్యాణి సకల కళా వేదిక ఆధ్వర్యంలో సంక్రాంతి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వ్యక్తులకు పురస్కారాలిచ్చి ప్రోత్సహించడంలో సంస్థ ముందు వరుసలో ఉంటుందన్నారు. గౌతమేశ్వర సాహితీ సేవా సంస్థ ప్రచురించిన ఇంతకీ నువ్వెవరు కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. జ్యోతిష, వాస్తు, పౌరోహిత్య, చిందు యక్షగాన, సాహిత్య తదితర రంగాల్లో సేవలందిస్తోన్న 73 మందికి సంక్రాంతి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యాణి సకల కళా వేదిక సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీధర్, డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం, ఓమర్ ఎజాస్‌ఖాన్, అరిసెనపల్లి శ్రీనివాస్, పొర్ల వేణుగోపాల్ రావు, కళాధరరావు, బుర్ర లక్ష్మీనారాయణ, కుంచాల లావణ్య, ముప్వ హరీశకుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయాల హుండీ లెక్కింపు

కరీంనగర్ కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయాల హుండీలను సోమవారం ఉదయం 10 గంటలకు లెక్కించనున్నట్లు ఈవో కొస్న కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ యాగండ్ల అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది సకాలానికి విధిగా హాజరుకావాలని కోరారు.

బంగారు మైసమ్మ తల్లి ఉత్సవాలు

గణేశ్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బంగారు మైసమ్మ తల్లి ఉత్సవాలను ఆదివారం హౌసింగ్ బోర్డు కాలనీలో ఘనంగా నిర్వహించారు. కాలనీలోని నారదాసు వసంతరావు-స్రవంతమ్మ దంపతుల ఇంట్లో ప్రతిష్ఠించిన బంగారు మైసమ్మను ఉదయం నుంచే భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు.

'ఓట్ల కోసమే శంకుస్థాపనలు'

భగత్‌నగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో ఓట్లకోసం నగర మేయర్ శంకుస్థాపనలు చేస్తున్నారని సీపీఐ నగరకార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజుల ఒక ప్రకటనలో ఆరోపించారు. కరీంనగర్ నగర పాలకవర్గం పదవీ కాలం వారం రోజులు మాత్రమే ఉండగా డివిజన్లలో విచ్చలవిడిగా శంకుస్థాపనలు చేస్తున్నారన్నారు. మేయర్‌కు చిత్తశుద్ధి ఉంటే తన హయాంలో చేసిన పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా డాక్టర్స్ క్రికెట్ లీగ్ పోటీలు



ట్రోఫీ, మెడల్స్‌తో మహిళల విభాగంలో విజేతగా నిలిచిన జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెసిడెంట్ కప్ డాక్టర్స్ క్రికెట్ లీగ్-2025 పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ పాఠశాల మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో నాలుగు పురుషుల డాక్టర్స్ క్రికెట్ జట్లు పాల్గొనగా, రెండు మహిళల క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. పురుషుల ఫైనల్స్ మ్యాచ్‌లో రెనెరాక్‌స్టార్, రోహాన్‌రేంజర్స్ జట్లు తలపడ్డాయి. నిర్ణీత ఓవర్లలో డాక్టర్ బంగారు స్వామి కెప్టెన్సీలోని రెనీరాక్‌స్టార్ జట్టు 128 పరుగులు చేయగా, డాక్టర్ ఎనమల్ల నరేష్ కెప్టెన్సీలోని రోహాన్‌రేంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 111 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. మహిళల విభాగంలో డాక్టర్ చేతన కెప్టెన్సీలోని ఆదర్శదివాస్ జట్టు విజేతగా నిలవంగా డాక్టర్ శ్రీలక్ష్మి కెప్టెన్సీలోని సూపర్‌క్వీన్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతల జట్లకు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, తానా అధ్యక్షుడు డాక్టర్ అరుణ్‌కటారి, ఫిజీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రెడ్డి బహుమతులు, ట్రోఫీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్, డాక్టర్ నవీన్, డాక్టర్ విజయ్, డాక్టర్ భాగ్యరెడ్డి, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ జక్కని తిరుపతి ఇతర క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు.

గోదా రంగనాథస్వామి కల్యాణం

కరీంనగర్ కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం వేదభవనంలో గోదా రంగనాథస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేదభవనం ప్రిన్సిపాల్ డాక్టర్ కె వరప్రసాదాచార్యుల బృందం వైదిక నిర్వహణలో కల్యాణ ప్రక్రియ శాస్త్రీయంగా కొనసాగింది. కార్యక్రమంలో వికాసతరంగిణి అధ్యక్షుడు కె గౌతమరావుతో పాటు బీవీ రావు, సిరికొండ వేంకటేశం, రవీందర్ రావు, విజయ్‌రెడ్డి, భక్తులు, వేదాధ్యయన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బెస్త (గంగపుత్ర) జిల్లా, పట్టణ సంఘం రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమ లాకర్ ఆవిష్కరించారు. ఆదివారం ఆయన నివాసంలో జరిగిన కార్యక్ర మంలో ఇటీవల పట్టణంలోని ఐదు జోన్ కార్యవర్గాలను ఎమ్మెల్యే సన్మానిం చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తోట రాములు, సంఘం జిల్లా అధ్యక్షుడు కూర ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి రాజన్న, సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడప బాలకిషన్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పావనకృష్ణ, మర్రి జనార్దన్, ఐదు జోన్ల అధ్యక్ష, కార్యదర్శులు, సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

● హుజూరాబాద్: కాట్రపల్లి గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని తాజా మాజీ సర్పంచ్ కాసగోని నిరోషా-కిరణ్ ప్రభుత్వాన్ని కోరారు. అధికారులు పూర్తి స్థాయిలో సర్వే చేసి నిరుపేదలకు ఇళ్లు, రేషన్‌కార్డులు అందించాలని తెలిపారు.

● శంకరపట్నం: మహాజన ఉద్యమ నేత మంద కృష్ణ మాదిగను కొట్టి చంపేస్తారని మాట్లాడిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై ఆదివారం కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆడెపు నర్సయ్య, కోడూరి మహేష్, కలకోట సమ్మయ్య, చల్లూరి రాజేందర్, రామగిరి రాములు, రాజకొంరయ్య, రాకేష్, పౌలు పాల్గొన్నారు.

● గన్నేరువరం: మండల కేంద్రంలోని వి జ్ఞాన్ హైస్కూల్‌లో ఆదివారం కరీంనగర్ సురక్ష హాస్పిటల్‌కు చెందిన ప్రొఫెసర్ ఆఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ చొక్కారపు రాము నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బూర వెంకటేశ్వర్, ప్రిన్సిపాల్ భానుచైతన్య హాస్పిటల్, సిబ్బంది పాల్గొన్నారు.

● రామడుగు: దేశరాజ్‌పల్లి గ్రామంలో జరుగుతున్న వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులకు యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అనుపురం పరశురాం గౌడ్ ఆదివారం స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పూరెళ్ల రాజశేఖర్, మామిడి దిలీప్‌కుమార్, మాదం శివ, వేముల రమేష్, మునిందర్, సిరికొండ సాయి తేజ, పంజాల సతీష్, ఉన్నారు.

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌పై సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా అనుచిత పోస్టులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శనిగరపు అర్జున్ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు లంక మల్లేశం, పూడూరి మల్లేశం, తడగొండ అజయ్, తడగొండ రాజు, జట్టు అంజయ్య, పురానం రమేష్, అశోక్, ప్రభాకర్, రాకేష్ ఉన్నారు.

- మండల రాయల్స్ క్రికెట్ టీమ్‌కు రూ. 10 వేలు విలువ చేసే టీ షర్టులను బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెసరి రాజమౌళిలు అందజేశారు. ఈ మేరకు క్రీడాకారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కోతకు గురైన రోడ్డు

» రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు » పట్టించుకోని అధికారులు



బూరుగుపల్లి సమీపంలో రోడ్డు దుస్థితి

గంగాధర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం బూరుగుపల్లి మంచి నీటి బావి సమీపంలో నాలుగు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. మల్యాల మండలంతో పాటు గంగాధర మండలంలోని లింగంపల్లి, కొండయ్యపల్లి, ర్యాలపల్లి, చర్లపల్లి(ఆర్) గ్రామస్థులు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. మోడల్ స్కూల్ బస్సులతో పాటు జగిత్యాలకు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. బూరుగుపల్లి తాటి వనం వద్ద నాలుగు నెలల క్రితం భారీ వరదలకు రోడ్డు కోతలకు గురై పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలకు దారి ఇచ్చే సమయంలో ప్రమాదాలు జరుతున్నాయని వాపోతున్నారు. నాలుగు నెలలుగా అధికారులు పట్టించు కోవడం లేదని, ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పంటలను కాపాడాలి

గంగాధర, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పొలాలు ఎండిపోకుండా ఎల్లంపల్లి నీరు అందించి పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధర మండలం చర్లపల్లి(ఎన్) గ్రామంలో ఎండిపోతున్న పొలాలను ఆదివారం మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు కంకణాల విజేందర్‌రెడ్డి, కనుకయ్య, ఎండీ నజీర్‌హుస్సేన్, ఆదిమల్లు, శంకర్, మల్లయ్య, స్వామి, పర్శరాములు తదితరులు ఉన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

హుజూరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌కు రన్నింగ్, షాట్‌పుట్, వాకింగ్, టగ్గాఫర్ ఆటల పోటీలు నిర్వహించగా, 200 మంది పాల్గొన్నారు. గెలుపొందిన వాకర్స్‌కు భాస్కర్, వెంకటేష్ బహుమతులు సమకూర్చగా వి రవీందర్‌రావు, బి శ్రీనివాస్, కె శ్రీనివాస్, టి శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రాజిరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోరపల్లి రోడ్‌లో పెట్రోల్ బంక్ ప్రారంభం



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న బంక్ యజమాని కుటుంబ సభ్యులు

జమ్మికుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని కోరపల్లి రోడ్‌లో ఆదివారం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను యజమాని బచ్చు భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినిత్యం వందలాది వాహనాలు మార్కెట్ యార్డుకు రాకపోకలు సాగిస్తుంటాయని చెప్పారు. వాహనదారులకు క్వాలిటీతో కూడిన పెట్రోల్ అందించాలని ఈ బంక్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. వాహనదారులు వినియోగించుకోవాలని కోరారు.

ప్రజలను గోస పెడుతున్న ప్రభుత్వం

తిమ్మాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ప్రజలను మోసగిస్తోందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకుల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రసమయి బాలకిషన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పేరుతో నియోజకవర్గంలో పెద్ద స్కాం జరగబోతోందని అన్నారు. పదివేలు ఇస్తే రేషన్ కార్డు, యాభైవేలు ఇస్తే ఇల్లు మంజూరు చేసేలా ఇందిరమ్మ కమిటీలకు ఆదేశాలు అందాయని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఏకా నందం, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సినారె



విశ్వంభరుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి అని, నిర్మోహమాటంగా మాట్లాడేవారని పిల్లల వైద్య నిపుణుడు, సినారె రాష్ట్ర స్థాయి పురస్కార కమిటీ చైర్మన్ డాక్టర్ ఎడవెల్లి విజయేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన విశ్వంభరుడు పుస్తక పరిచయ సభ వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో జరిగింది. పుస్తక పునరావిష్కరణ అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన విజయేంద్రరెడ్డి మాట్లాడుతూ పలు ప్రక్రియల్లో శతాధిక గ్రంథాలను అందించిన సినారె ప్రజల మనసులను దోచుకునే సినీపాటలను ప్రపంచానికి అందించిన మహాకవి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట రామకృష్ణ, న్యాయవాది, ఉదయ సాహితి అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి, విశ్రాంత ఉపన్యాసకుడు అన్నాడి గజేందర్‌రెడ్డి, నగునూరి రాజన్న, వేములవాడ ద్రోణాచారి, గంప ఉమాపతి, బొమ్మకంటి కిషన్, పి సత్యనారాయణరాజు, డాక్టర్ బొద్దుల లక్ష్మయ్య, వేంకటేశ్వర్లు, సంపత్‌కుమార్, జితేందర్‌రావు, కుమార్, జయపాల్‌రెడ్డి, శంకరయ్య, రామయ్య, రాము, సాంబమూర్తి పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల బైక్ ర్యాలీ

హుజూరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని ఆదివారం ఆ పార్టీ నాయకులు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో క్రాస్ నుంచి పలు వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి కె శంకర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 28వరకు సంగారెడ్డిలో నిర్వహించే సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డి రత్నాకర్, శంకర్, లింగయ్య, చిరంజీవి, మహేష్, రవి, వెంకటేష్, తిరుపతి, శ్రీధర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హుజూరాబాద్‌లో పాల్గొన్న 1980-82 బ్యాచ్ విద్యార్థులు



శంకరపట్నంలో పాల్గొన్న 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

హుజూరాబాద్/శంకరపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1980-82లో బైపీసీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పుడు తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. పట్టణంలోని ఉషోదయ ఉన్నత పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిచారు. ఈ సందర్భంగా అప్పుడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎడవెల్లి సంజీవరెడ్డి, కొత్త నాగిరెడ్డి, గోలి శ్రీనివాస్, అనుమాండ్ల ప్రసాద్‌రెడ్డి, బెదరకోట జనార్ధన్, అకినపల్లి శ్రీనివాస్, చంద్రగిరి మల్లేశం, సాయన్న, బాబురావు, రాజు, చందుపట్ల రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు. శంకరపట్నం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కేశవపట్నం హైస్కూల్‌లో 1999-2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఆంజనేయులు, సుమ, స్వరూప, సునంద, చంద్రకళ, మల్లీశ్వరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.